ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 25-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- గురు తేజ్ బహదూర్ 350వ షహీదీ దివస్ ను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనను స్మరించుకున్నారు.
- భారత రాజ్యాంగ 76వ వార్షికోత్సవం పార్లమెంట్ లోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో రేపు జరగనుంది.
- భారత నావికాదళం, తీర గస్తీ దళాలకు చెందిన ప్రతీ నౌక దేశీయ షిప్‌యార్డుల్లో నిర్మితమవుతున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- నూతన కార్మిక చట్టాలు కార్మికులకు వృత్తిపరమైన భద్రతను కల్పిస్తాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.
- పురుషుల టీ-20 ప్రపంచ కప్ 2026 షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది.

==========

గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్ ను పురస్కరించుకుని హర్యానాలోని కురుక్షేత్రలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పాల్గొన్నారు. తొలుత గురు గ్రంథ్ సాహిబ్‌కు ప్రధానమంత్రి నివాళులర్పించారు. అనంతరం గురు తేజ్ బహదూర్ జీ గౌరవార్థం ప్రత్యేక నాణాన్ని,స్మారక స్టాంపును నరేంద్ర మోదీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ ప్రొఫెసర్ అసిమ్ కుమార్ ఘోష్, ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని పాల్గొన్నారు. గురు తేజ్ బహదూర్ 350వ షహీదీ దివస్‌ను పురస్కరించుకుని, కేంద్ర ప్రభుత్వం ఏడాది పొడవునా

స్మారక చిహ్నాన్ని పాటిస్తోంది. అంతకుముందు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ జ్యోతిసర్‌లో శ్రీకృష్ణుని పవిత్ర శంఖం గౌరవార్థం నిర్మించిన 'పంచజన్య స్మారక చిహ్నాన్ని' ప్రారంభించారు.

==========

ఉత్తరప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయోధ్యలో ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాలరాముడి ఆలయ శిఖరంపై ధర్మధ్వజాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రధానమంత్రి ప్రసంగిస్తూ.. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేటితో పూర్ణాహుతి జరిగిందన్నారు. ధర్మధ్వజం కేవలం జెండా కాదని.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమన్నారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక అని శ్రీరాముడి సిద్ధాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుందన్నారు. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

==========

భారత రాజ్యాంగం 76వ వార్షికోత్సవం పార్లమెంట్ లోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో రేపు జరగనుంది. ఈ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఉభయ సభల పార్లమెంటు సభ్యులు కూడా పాల్గొంటారు. ఈ వేడుకల్లో భాగంగా రాజ్యాంగ ప్రవేశికను రాష్ట్రపతి చదివి వినిపిస్తారు. అలాగే మలయాళం, మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కాశ్మీరీ, తెలుగు, ఒడియా, అస్సామీలతో సహా తొమ్మిది భాషలలో రాజ్యాంగం అనువాదాలను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా ఒక స్మారక బుక్‌లెట్ ను కూడా రాష్ట్రపతి విడుదల చేస్తారు.

==========

భారత నావికాదళం, తీర గస్తీ దళాలకు చెందిన ప్రతీ నౌక దేశీయ షిప్‌యార్డుల్లో నిర్మితమవుతున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఇది ఆత్మనిర్భర్ భారత్ కు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. `సముద్ర ఉత్కర్ష్` పేరిట న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ... దేశంలో వాణిజ్యం ఎక్కువ శాతం సముద్ర మార్గాల ద్వారానే జరుగుతుందని తెలిపారు. ఈ రవాణా విధానం ఖండాల మధ్య భారీ సరుకును తరలించడానికి, అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన మార్గంగా ఉందని రాజ్ నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.. రక్షణ రంగ ఉత్పత్తుల్లో సాంకేతికత ప్రధాన భూమిక పోషిస్తోందని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 29 సెకన్లు)

==========

నూతన కార్మిక చట్టాలు కార్మికులకు వృత్తిపరమైన భద్రతను కల్పిస్తాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన జాతీయ వాణిజ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సరళీకృతం చేసి, కాగితపు పనిని తగ్గించిందన్నారు. అలాగే విధాన పరమైన సౌలభ్యం కోసం ఆమోద అవసరాలను తగ్గించడానికి నాలుగు ప్రధాన చట్టాలుగా వర్గీకరించిందన్నారు. కొత్త కార్మిక చట్టాలు మెరుగైన కార్మిక పద్ధతులను ప్రోత్సహిస్తాయని చెప్పారు. జాతీయ స్థాయిలో కనీస వేతనాలకు హామీ ఇస్తాయని, గిగ్ కార్మికులతో సహా సామాజిక భద్రతా ప్రయోజనాలను విస్తరిస్తాయని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

విరామం

==========

లింగ సమానత్వం మహిళా సాధికారతపై దేశవ్యాప్త ప్రచారం అయిన నయీ చేతన - పహల్ బదలావ్‌కీ నాల్గవ ఎడిషన్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమానత్వం కేవలం నినాదం కాదని, అది భారతదేశ సంస్కృతికి ఆత్మవంటిదన్నారు. మహిళలు సాధికారత సాధించినప్పుడే సమాజం శక్తివంతమవుతుందని తెలిపారు.

(వాయిస్ 28 సెకన్లు)

ఈ కార్యక్రమంలో కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖా మంత్రి అన్నపూర్ణా దేవి మాట్లాడుతూ... మహిళలు భారతదేశ వృద్ధికి కేవలం తోడ్పడేవారు మాత్రమే కాదని, అభివృద్ధి చెందిన దేశానికి చోదక శక్తి అని అన్నారు. నయీ చేతన 4.0 కేవలం ఒక కార్యక్రమం కాదని భారతదేశంలోని ప్రతి మహిళకు భద్రత, గౌరవం సమానత్వాన్ని నిర్ధారించడానికి ఒక జాతీయ సంకల్పమని పేర్కొన్నారు.

==========

గోవా వేదికగా జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఆరవ రోజైన ఈరోజు సినీ ఆశావాహులకు ఉపయోగపడే పలు మాస్టర్ క్లాస్ సెషన్స్ జరిగాయి. ప్రముఖ దర్శకుడు శేఖర్ కపూర్ నేతృత్వంలో “ది న్యూ ఏఐ సినిమా” పేరిట జరిగిన మాస్టర్ క్లాస్ లో చలన చిత్ర నిర్మాణంలో ఏఐ ఆధారిత వర్ధమాన సాంకేతికత, నూతన ధోరణులపై తమ తమ ఆలోచనలను పంచుకున్నారు. అలాగే “త్రూ ది లెన్స్” పేరిట జరిగిన మరొక మాస్టర్ క్లాస్ లో సినిమాటోగ్రాఫర్ రవి వర్మ తన అనుభవాలను, సినిమా దృశ్యాలను బందించడంలో కెమెరా మెలుకువలను, విజువల్ స్టోరీ టెల్లింగ్ పై పలు విలువైన సలహాలను తెలియజేశారు. ఇక రేపు “గీతాంజలి” తెలుగు క్లాసిక్ చిత్రాన్ని ఇఫీలో ప్రదర్శిస్తారు. ఈ సినిమాలో నటించిన తెలుగు నటుడు అక్కినేని నాగార్జున ఈ ఇఫీ చిత్రోత్సవానికి హాజరుకానున్నారు.

==========

పురుషుల టీ-20 ప్రపంచ కప్ 2026 షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఈరోజు ప్రకటించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఈ ప్రపంచకప్ కు ఆతిథ్యమివ్వనున్నాయి. ప్రపంచకప్ పోటీలకు అర్హత సాధించిన 20 జట్లను ఐసీసీ 4 గ్రూప్‌లుగా విభించించింది. ప్రతి గ్రూప్ నుంచి రెండేసి జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. ఇటలీ తొలిసారి ఈ టోర్నీకి అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లు భారత్‌లోని అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి, శ్రీలంకలోని క్యాండీ, కొలంబోనగరాల వేదికగా జరగనున్నాయి.

==========

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84,900 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 313 పాయింట్ల నష్టంతో 84,587 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 74 పాయింట్ల నష్టంతో 25,884 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 89 రూపాయల 20 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4,135 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

==========
==========